క్లుప్తంగా

రైతు రుణమాఫీ జాబితా వివరాలతో ఫ్లెక్సీలు



పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన రుణమాఫీ జాబితా వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ప్రతి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని అన్నారం బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో రైతు, బ్యాంకు పేరు, రుణమాఫీ చేసిన డబ్బులు, ఎంత మంది రైతులు, గ్రామానికి రుణమాఫీ మొత్తంలో ఎంత మొత్తంలో లబ్ధి చేకూరింది అనే అంశాలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామంలో మొత్తం 172 మంది రైతులకు సంబంధించి రూ. 1.56 కోట్ల వరకు రుణమాఫీ అయింది.

ఛత్రపతి సాహు మహరాజ్ సేవలు మరువలేనివి



వనపర్తిటౌన్: సామాన్య ప్రజలు, నిమ్న కులాల హక్కుల కోసం ఆర్థిక, వైద్య, విద్య వ్యవసాయం రంగాల అన్నింటిలోనూ విప్లవాత్మకమైన చట్టాలను తీసుకొచ్చిన ఛత్రపతి సాహు మహారాజ్ సేవలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఛత్రపతి సాహు మహారాజ్ 103వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, గంధం నాగరాజు, శాంతన్న, కళాకారులు బాలేమియా, పానుగంటి యేసోప్, గాయకుడు చింతకుంట కురుమయ్య, గంధం కృష్ణయ్య, కుశకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



కొత్తకోట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం 11 మంది లబ్ధిదారులకు మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జేఎం మిషేక్, రవీందర్‌రెడ్డి, దేవస్థానం డైరెక్టర్ బాదం వెంకటేష్, ముజీబ్, మతీన్ పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన



అమరచింత: గ్రామాల్లో ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్లు, యజమానులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్ఐ సురేష్ అన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణంలో మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులను రహదారి భద్రతలపై అవగాహన కల్పించారు. అతివేగంగా ట్రాక్టర్లను నడపరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, ట్రాక్టర్‌కు సంబంధించిన అన్ని రకాల పత్రాలు ఉండాలని సూచించారు. జిల్లాలో రెండు రోజుల నుంచి ట్రాక్టర్ కిందపడి చిన్నారులు చనిపోతున్న ఘటనలు ఎక్కువవుతున్నాయని, వీటిని అరికట్టడంలో డ్రైవర్లు దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నప్పుడు అతివేగంగా ట్రాక్టర్లను నడపడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

మానవపాడు: బాలల హక్కులు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ శివలీల అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎం, ఆశాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలల సమస్యల పరిష్కారం కోసం 1098 సర్వీసు 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ హేమమానస, ఎమ్‌ఎల్‌పీ వీణ, సూపర్‌వైజర్ చంద్రన్న, చిట్టెమ్మ, డీసీపీయూ సూపర్‌వైజర్ నవీన్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అర్హులకు లబ్ధి చేకూరేనా?

- ఇందిరమ్మ కమిటీలిచ్చిన జాబితాపై తుది విచారణ
- గ్రామాల్లో ఇంటి దరఖాస్తుదారుల వివరాలపై అధికారులు ఆరా..



పాన్‌గల్‌లో ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)



మల్లాయిపల్లిలో లబ్ధిదారుల వివరాలపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ (ఫైల్)

పాన్‌గల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చివరి విచారణ మొదలైంది. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన జాబితా వివరాలతో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన మొదలెట్టారు. జాబితాలో పేరున్న ప్రతి ఇంటి తలుపు తడుతూ ఎంపీడీఓ, తహసీల్దార్, ఏఓ, మండల పంచాయతీ అధికారులు, ఏఈలు వేర్వేరుగా గ్రామాల్లో జాబితాపై విచారణ చేస్తున్నారు.

మండల పరిస్థితి..

మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు కలిపి మొత్తం 548 ఇళ్లు మంజూరయ్యాయి. ఆయా జీపీల్లో పెద్ద జీపీలు కేతేపల్లికి 50, పాన్‌గల్‌కు 45, రేమద్దులకు 56, బుసిరెడ్డిపల్లికి 34 చొప్పున ఇళ్లు కేటాయించారు. గ్రామాల్లో 70 మంది ఓటర్లకు ఒక ఇల్లు చొప్పున ఇళ్ల కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. కేటాయించిన ఇళ్లు ఏమాత్రం సరిపోవని ఆయా గ్రామాల నాయకులు అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు సూచిస్తున్నా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు కేటాయిస్తున్నామని, అవసరమైతే రెండో విడతలో మళ్లీ మంజూరు చేస్తామని చెబుతున్నారు. ఇటీవల మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో పాల్గొన్న మంత్రి జూపల్లి అధికారులు, నాయకులకు తగు సూచన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో ఎట్టి పరిస్థితుల్లో అనర్హులను గుర్తించొద్దన్నారు.

మండలాల వారీగా..

మండలం	జీపీలు	మంజూరైన ఇళ్లు
చిన్నంబావి	17	328
పాన్‌గల్	28	548
వీపనగండ్ల	14	302

వీరు అనర్హులు..

- సొంత స్థలం ఉన్నా ఆర్‌సీసీతో ఇంటి నిర్మాణం ఉంటే.
- 2.5 ఎకరాల తడి(ఇరిగేషన్), 5 ఎకరాల మెట్ట (డ్రై) భూమి ఉన్నవారు.
- 4 చక్రాల వాహనాలు కలిగి ఉన్న వారు
- కిసాన్ క్రెడిట్ కార్డు కలిగి ఉండి రూ.50 వేలపై పరిమితి మించితే
- కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఆదాయపన్ను, ప్రొఫెషన్ ట్యాక్స్ చెల్లింపుదారులుంటే
- ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం ఉంటే, వలస వచ్చిన కుటుంబాలైతే వీరు అర్హులు కారని అధికారులు చెబుతున్నారు.

నగదు పెంచాలి



ప్రభుత్వం ఇచ్చే రూ. 5 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తికాదు. దీంతో పేదలు ఇంటి నిర్మాణం కోసం ముందుకు రావడం లేదు. రూ.7.50 లక్షలు చెల్లించడమో, ప్రభుత్వమే నిర్మించి ఇవ్వడంతో చేస్తే పేదలకు మేలు జరుగుతుంది. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అధికారులు పక్షపాతం చూపకుండా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన పేర్లల్లో అర్హులైన పేదవారు ఉన్నారా లేదా అనే విషయాలను గుర్తించాలి.

– కళావతమ్మ, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు, కేతేపల్లి.

ఇళ్లు లేని వారికి..



ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో మొదటగా ఇళ్లు లేనివారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేటప్పుడు వారికి ఇళ్లు, స్థలం ఉందా లేదా అనే విషయాలను గుర్తించి వారిలో పేదవారికి న్యాయం చేయాలి.

– రేణుకమ్మ, పాన్‌గల్

అర్హులను గుర్తిస్తున్నాం



మండలంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన లబ్ధిదారుల వివరాలల్లో అర్హులా కాదా అనే విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నాం. మండలంలోని 28 జీపీల్లో ఇప్పటి వరకు 18 జీపీల్లో వివరాల సేకరణ పూర్తి చేశాం. ఇంకా 10 జీపీల్లో చివరి స్థాయిలో ఉంది. వాటిని పూర్తి చేసి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తాం.

– గోవింద్‌రావు, ఎంపీడీఓ, పాన్‌గల్

కార్యకర్తలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని వ్యవసాయశాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తాడిపర్తి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త అడ్డాకుల రవీందర్ ఇటీవల ప్రమాదానికి గురై మరణించాడు. మంగళవారం మాజీ మంత్రి తాడిపర్తి గ్రామంలోని అడ్డాకుల రవీందర్ ఇంటికి వెళ్లి పార్టీ బీమా చెక్కు రూ.రెండు లక్షలు వారి సతీమణి అంజలికి అందించి మనోధైర్యం చెప్పారు. కార్యకర్తల సంక్షేమం కోసం కేసీఆర్ బీమా కల్పించారని, గతంలో రైతు బీమా ద్వారా మరణించిన రైతులకు ఐదు రోజుల్లోనే రూ.ఐదు లక్షలు అందించిన ఘనత, కల్యాణలక్ష్మితో పేదింటి ఆడబిడ్డలకు రూ.1,00,116, కేసీఆర్ కిట్ ద్వారా బాలింతలకు రూ.13 వేలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజీవ్ యువ వికాసానికి ఇంటర్వ్యూలు

కోడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు. కోడేరు, జనుంపల్లి, నాగులపల్లి, పస్పుల, తీగలపల్లి గ్రామాల లబ్ధిదారులు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు.

గోప్లాపూర్‌లో రెవెన్యూ సదస్సు



పెంట్లవెల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంలో భాగంగా మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని గోప్లాపూర్, వేముకల్లులో భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయసింహ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. భూ సమస్యలను రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోప్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్, బాలకోట్యనాయక్, ఉమాదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి



మాట్లాడుతున్న కుతుబ్

అమరచింత: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే ప్రారంభించి, విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరచింత మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పాలకులు మాత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయట్లేదని వాపోయారు. కళాశాల నిర్మాణం కోసం పట్టణంలో ప్రభుత్వ స్థలం కేటాయించి మూడేళ్లు గడిచినా.. అడుగు ముందుకు పడట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్ చదివేందుకు ఆత్మకూర్, వనపర్తి, గద్వాల, పాలమూర్ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపరించాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఈ విద్యాసంవత్సరంలోనే జూనియర్ కళాశాల ప్రారంభించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో యంగ్ ఇండియా శిబిరం నిర్వహణ



కొత్తకోటలో మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్ ఘని

కొత్తకోట: యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ నిర్వహణలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న విద్యార్థుల వేసవి శిబిరాన్ని మంగళవారం వనపర్తి జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని సందర్శించారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఘనీ మాట్లాడుతూ వేసవి శిబిరాలు విద్యార్థుల్లో శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి దోహదం చేస్తాయన్నారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు 15 నుంచి 20 రోజుల పాటు వేసవి శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వలంటీర్ల ద్వారా నిర్వహించే ఈ క్యాంప్‌లో ఆటలు, డ్యాన్స్, స్పోకెన్ ఇంగ్లిష్, జనరల్ మాథ్స్, డ్రాయింగ్ వేయడం, పెయింటింగ్ సాధన, కాగితాలతో బొమ్మలు తయారీ, సైన్స్ ప్రయోగాలు, కర్రసాము, యోగా, చదరంగం, నృత్యం వంటి విషయాలలో ఆసక్తి చూపేటట్లు ప్రోత్సహించాలని ఉపాధ్యాయుడు దేవన ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో మహానంది, వలంటీర్లు రామేశ్వరి, జ్యోష్ణవి, డ్యాన్స్ మాస్టర్ వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: ప్రభుత్వ ఆదేశాలు లేకపోయినా స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో హరివిల్లు పేరుతో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్‌ఎం పద్మ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో సమ్మర్ క్యాంపును ఎంఈఓ ప్రారంభించారు. విద్యార్థులపై ప్రేమ, బాధ్యతతో స్వచ్ఛందంగా పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని ఎంఈఓ అభినందించారు. శిబిరంలో గణితం, సైన్స్, డ్రాయింగ్, ఆర్ట్‌క్రాఫ్ట్, డాన్స్, పెయింటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ బృందం వెంకట్‌నారాయణ, వెంకటేష్‌యాదవ్, ప్రేమ్‌సాగర్, వాలంటీర్ శిరీష, ఎమ్మార్సీ సిబ్బంది గోవింద్, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

అమరచింత: పంట మార్పిడితో రైతులు అధికంగా లాభాలు పొందే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి అరవింద్ అన్నారు. మండలంలోని చంద్రగఢ్ గ్రామంలో మంగళవారం 'రైతు ముంగిట్లో వ్యవసాయ అధికారులు' కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా దేశం మొత్తంలో ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఉన్నట్లే ప్రతి రైతుకు ఒక యూనిక్ ఐడీని కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. దీని కోసం రైతులు పాసు పుస్తకం, సెల్ నంబర్ తీసుకుని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు లేదా మీసేవా ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. పంటల సాగులో యూరియా వాడకం తగ్గించాలని, పామాయిల్ సాగుతో లాభాలు ఉన్నాయన్నారు. విత్తన శుద్ధి, వానాకాలంలో వేసే పంట రకాల ఎంపిక, విత్తన రశీదు, నకిలీ విత్తనాల విషయంలో మోసపోకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హరిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న నోడల్ ఆఫీసర్ వంశీకృష్ణ

వీపనగండ్ల: వడదెబ్బకు గురి కాకుండా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని నోడల్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గర్భిణుల నమోదును ప్రణాళికాబద్ధంగా చేపట్టి ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేవిధంగా చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఓఆర్ఎస్ పాకెట్లను, ఎమర్జెన్సీ మందులను అందుబాటులో ఉంచుకుని అవసరమైన వారికి అందజేయాలన్నారు. రికార్డుల నమోదులో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజశేఖర్, ఆయుష్ డాక్టర్లు హేమవర్ధన్, శ్వేత, కరుణశ్రీ, భాగ్యశ్రీ, కేశవులు, హెచ్‌ఈ కలమ్మ, విజయకుమారి, జహంగీర్, పలువురు ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'ఆశాలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి'



ఆత్మకూర్‌లో..



డాక్టర్ ఆసీయాకు వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

కొత్తకోట: దేశవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు 20 ఏళ్ల నుంచి పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారని, అలాంటి వారిపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జె.భాగ్య డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం షరతులతో కూడిన పారితోషికాలు 60 శాతమే చెల్లిస్తున్నారని, వీటి వల్ల చాలీచాలని వేతనాలు ఆశాలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని కోరుతూ మంగళవారం కొత్తకోట పీహెచ్‌సీ డాక్టర్ ఆసీయా బేగంకు సమ్మెకు సంబంధించిన వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేల కనీస వేతనం అందించాలని కోరారు. సమావేశంలో ఆశా యూనియన్ అధ్యక్షురాలు మంజుల, స్వాతి, గీత, వరలక్ష్మి, పుష్ప, బుచ్చమ్మ, చంద్రకళ, లక్ష్మి, కాంచన, రేణుక, పాలెం శ్వేత, మంజుల, ఇందిరా, చిట్టెమ్మ, సంతోష తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఆత్మకూర్: ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎస్ రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆశా వర్కర్లతో కలిసి తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫయాజ్‌కు సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో సంధ్య, రాజేశ్వరి, నవనీత, నిర్మల, మాధవి, పుష్పమ్మ పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన సిబ్బందికి సన్మానం



పదోన్నతి పొందిన డ్రైవర్, కండక్టర్లను సన్మానిస్తున్న అధికారులు

వనపర్తిటౌన్: 33 ఏళ్లుగా డ్రైవర్, కండక్టర్లుగా విధులు నిర్వహించి ఏడీసీలుగా పదోన్నతులు పొందిన సిబ్బందిని టీజీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డిపోలో ఘనంగా సన్మానించారు. ఇటీవల మహబూబ్‌నగర్ రీజియన్ పదోన్నతులు విడుదల చేయడంతో వనపర్తి డిపో నుంచి 10 మంది కండక్టర్లు, ఒక డ్రైవర్ పదోన్నతి పొందారని మెకానికల్ ఫోర్‌మెన్ దేవేందర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి సి.నాగేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాల్‌రెడ్డి, టీఐ సాయిరెడ్డి, డీసీ పీవీ స్వామి, ప్రచార కార్యదర్శి గోవర్ధన్, కోశాధికారి కురుమయ్య, కంట్రోలర్లు రాములు, ఎంఎస్ రావు, ఆంజనేయులు, బద్రినాయక్, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి


పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 14న నిర్వహించే పూలే, అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయాలని జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు గడ్డం విజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని కల్వకోలులో జాతరకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. బహుజన కళాకారులతో ధూంధాం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల రాజ్యాధికారం లక్ష్యంగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో బాలస్వామి, నరేందర్, వెంకటయ్య, విజయ్, రాముడు, కురుమూర్తి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మకాంటాల్లో భారీ అవకతవకలు




ఖిల్లాఘనపురంలో రైస్‌మిల్లు వద్ద ధాన్యం కాంటా చేస్తున్న రైతు


ఖిల్లాఘనపురం: మండలంలోని పలు రైస్‌మిల్లుల్లో ఏర్పాటు చేసిన ధర్మకాంటాలు ఒక్కొక్క దగ్గర ఒక్కో తూకం రావడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని ఓ రైతు మంగళవారం నేరుగా గుర్తించారు. ప్రతి రోజు రైతులు తమ ధాన్యం బస్తాలను నేరుగా రైస్‌మిల్లులకు ట్రాక్టర్లలో తీసుకెళ్లి తూకం వేసి అన్‌లోడ్ చేసి వస్తున్నారు. మంగళవారం ఖిల్లాఘనపురం మండలంలోని సల్కెలాపురం గ్రామానికి చెందిన రైతు ఊషన్న రెండు ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలను నేరుగా తీసుకెళ్లాడు. మొదటగా మామిడిమాడ రోడ్డులో ఉన్న దివ్య నవ్య రైస్‌మిల్లు వద్ద ఉన్న ధర్మకాంటాలో 6516 నంబర్ గల ట్రాక్టర్‌లో తీసుకొచ్చిన 140 (40కిలోల) బస్తాలను ట్రాక్టర్‌తో సహ తూకం చేశారు. మొత్తం తూకం 9,910 కిలోలు వచ్చింది. తరువాత అదే ట్రాక్టర్‌ను మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న శ్రీ శ్రీనివాస రైస్‌మిల్లు తరలించి అక్కడ ఉన్న ధర్మకాంటాలో తూకం చేయగా 9,730 కిలోలు వచ్చింది. గొడవ జరగడంతో పక్కనే ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర రైస్‌మిల్‌లో తూకం చేయగా 9,640 కిలోలు వచ్చింది. ఇలా ఒక్కో రైస్‌మిల్లులో ఒక్కో తూకం క్వింటాళ్లల్లో తేడా రావడంతో మండల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఖిల్లాఘనపురం మండలంలోని అన్ని రైస్‌మిల్లుల వద్ద ఉన్న ధర్మకాంటాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



దివ్యనవ్య రైస్‌మిల్లులో వద్ద..



శ్రీ శ్రీనివాస రైస్‌మిల్లు వద్ద..



శ్రీలక్ష్మీ వెంకటేశ్వర రైస్‌మిల్లు వద్ద..